క్లుప్తంగా

స్ట్రాం వాటర్ డ్రైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సర్వే నంబర్18 నుంచి అల్లాపూర్ ఖుబా మసీదు వరకు 1.28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన స్ట్రాం వాటర్ డ్రైన్ పనులను గురువారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఇక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ డ్రైన్ పూర్తయితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ నసీర్, ఇస్మాయిల్, పార్వతమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రాఖీ వేడుకలు



మూసాపేట: మూసాపేట ప్రగతినగర్‌లోని కిడ్డీ మౌంట్ లిటేరా పాఠశాలలో గురువారం రాఖీ పండుగ నిర్వహించారు. విద్యార్థినీలు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి మాట్లాడుతూ.. రాఖీ పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దొడ్ల రామకృష్ణగౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నివసించే మారతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న యువ నాయకుడు దొడ్ల రామకృష్ణ గౌడ్ గరువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సత్యరాజు, శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



బాలానగర్: రాఖీ పండుగను పురస్కరించుకొని గురువారం ఈశ్వరి విశ్వ విద్యాలయం బాలానగర్ శాఖ బ్రహ్మకుమారీ మాధవి ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్‌కు రాఖీ కట్టారు. రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్ గుప్తా పాల్గొన్నారు.

‘మనూ’ ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్

దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 18 చివరి తేదీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ కేంద్రంలో ఖాళీగా ఉండే సీట్ల భర్తీకి అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ అర్షియా ఆజమ్ గురువారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించడానికి గడువు ఈ నెల 18వ తేదీ అని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ‘మనూ’వెబ్‌సైట్‌ను సందర్శించాలని, దరఖాస్తును కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్‌ను ఈ నెల 20వ తేదీ ఉదయం 9.30 గటల నుంచి గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఐటీఐ కార్యాలయాన్ని స్వయంగా లేదా టెలిఫోన్ ద్వారా ఫోన్‌నెంబర్ 040–23008428 లేదా సెల్‌ఫోన్ 9440692452లో సంప్రదించాలని కోరారు.

బోధనలో నాణ్యత పెంచేలా..

- పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలు
- మెళకువలతో మెరుగైన విద్యనందించేలా ప్రణాళికలు



కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు (ఫైల్)

కూకట్‌పల్లి: నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన బోధన అందించడానికి, బోధనా పద్ధతుల్లో మార్పులు, చేర్పులు తెలియజేసే విధంగా, లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రతి నెలా విద్యాశాఖ కాంప్లెక్స్ మీటింగ్‌లు నిర్వహిస్తుంది. పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాల వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కూకట్‌పల్లి బాలానగర్ మండల పరిధిలోని పాఠశాలల కాంప్లెక్స్ మీటింగ్‌లు ప్రతి నెలా 20 నుంచి 30వ తేదీ మధ్యలో నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి మండలంలో 7 ఉన్నత పాఠశాలలు, బాలానగర్ మండలంలో 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత నెల 24న శంషీగూడ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ మీటింగ్‌లో సుమారు 304 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అదే విధంగా 25న ప్రైమరీ స్కూల్‌లో కాంప్లెక్స్ మీటింగ్ జరిగింది. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లమ్మబండ రిక్షా పుల్లర్స్ కాలనీ మూసాపేట, బాలానగర్, అల్లాపూర్, కేపీహెచ్‌బీ కాలనీల పాఠశాలల నుంచి టీచర్లు పాల్గొని సమీక్ష, సమావేశాన్ని నిర్వహించారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు మీటింగ్‌కు హాజరై ఇతర టీచర్లతో బోధనకు సంబంధించిన మెళకువలను తెలుసుకోవడం, విద్యార్థుల సమస్యలు, పాఠాలు చెప్పే విధానంలో కొత్తగా వస్తున్న మార్పులపై చర్చించారు. బోధనా పద్ధతుల్లో మెళకువలు తెలుసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా ఆయా సబ్జెక్టుల టీచర్లు వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. టీచర్లు కూడా తమకు తెలిసిన విషయాలన్నీ ఒకరి నుంచి ఒకరికి తెలియజేయటం వల్ల విద్యార్థులకు మరింత లాభం చేకూరే అవకాశం ఉందని పలువురు టీచర్లు అభిప్రాయ పడుతున్నారు. కాంప్లెక్స్ మీటింగ్‌ల ద్వారా మెరుగైన విద్య విద్యార్థులకు చేరుతుందని పలువురు నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి

- వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ తదితరులు

బాలానగర్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొ. కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూలో జాతీయ హ్యాండ్లూమ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాదీ దుస్తులు ధరించడం ఒక ఆచారం మాత్రమే కాకుండా, అది మన దేశీయ చేనేత కార్మికుల జీవనోపాధిని ఆదుకోవడంలో మన పాత్రను సూచిస్తుందన్నారు. మనం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి శనివారాన్ని హ్యాండ్లూమ్ డేగా పాటిస్తూ ఖాదీ దుస్తులు ధరించాలని విశ్వవిద్యాలయం సిబ్బందికి సూచించారు. చేనేత భారత వైవిధ్యాన్ని, వేలాది మంది కార్మికుల నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. విశ్వ విద్యాలయ సిబ్బంది చేనేత వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ డా. కె. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు, క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటించిన డిప్యూటీ కమిషనర్



సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో గురువారం కూకట్‌పల్లి డీసీ సేవ ఇస్లావత్ శానిటేషన్, ఇంజనీరింగ్, ఆర్టికల్చర్, ఎంటమాలజీ, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో ఎల్ఐజీ గృహ సముదాయాల వద్ద పాదయాత్ర చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డా.పి.నాగిరెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బుచ్చిబాబు, వేణుగోపాల్, వీరారెడ్డి, స్వాతి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ శిరీష బాబురావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని ఇడబ్ల్యూఎస్ హౌసింగ్ కాలనీలో గురువారం డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకొని కాలనీలో తక్షణమే మౌలిక సదుపాయాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారులు వైష్ణవి, కాలనీ నాయకులు పవన్, దినేష్, మోజెస్, లక్ష్మి, రాజ్యం, శ్రీనివాస్‌రెడ్డి, పాతూరి గోపి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులకు వ్యక్తిగత కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు వార్డు కార్యాలయంలో గురువారం జీహెచ్‌ఎంసీ కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న కార్మికులకు వారి ఆరోగ్యం కూడా ముఖ్యమేనన్నారు. వారి వ్యక్తిగత శుభ్రత రిత్యా ఈ కిట్లను అందించామని తెలిపారు. వీటిని వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ రెడ్డి, రాజేష్‌రాయ్, కట్ట నరసింగరావు, మహబూబ్, సాంబశివరావు, పద్మ, రాజేశ్వరి, కృష్ణకుమారి, సుకన్య, సుబ్బలక్ష్మి, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్‌నగర్ తండావాసులను ఆదుకుంటాం



తండా వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: వరద ప్రభావానికి గురై ఫంక్షన్‌హాల్‌లో ఆశ్రమం పొందుతున్న అమృత్‌నగర్ తండా వాసులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఆశ్రయం పొందుతున్న వారిని గురువారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు.

రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి తప్ప నేడు ఒక్క మంచి పని కూడా జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మంచినీటి సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పుడుతున్నారని గుర్తు చేశారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రాయదుర్గం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 6 గంటలకు హోమం నిర్వహిస్తారు. కాగా అభిషేకం అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు వరలక్ష్మీవ్రతం కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమగ్ర అభివృద్ధే ధ్యేయం

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం చందానగర్ డివిజన్ పరిధిలోని సుమారు రూ.3.33 కోట్లతో వరద నీటి కాల్వ, పార్కుల ప్రహరీ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డు, శివాజీనగర్, భవానిపురం కాలనీ, వీకర్ సెక్షన్, శంకర్‌నగర్, కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్, ఇక్రిశాట్ కాలనీ, దీప్తిశ్రీనగర్, అర్జున్‌రెడ్డి కాలనీల్లో సీసీరోడ్లు, వరదనీటి కాల్వ, పార్కుల ప్రహరీ నిర్మాణాల పనులు చేపడుతామన్నారు. ప్రజల సంక్షేమం, కాలనీ అభివృద్ధే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ.3.33 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తానన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రశాంత వాతావరణం కలిస్తామన్నారు. అందరూ విరివిగా మొక్కలు నాటి పార్కులను సంరక్షించాలన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేసి ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- దోమల వృద్ధిని అరికట్టేందుకే డ్రై డే
- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పిలుపు మేరకు వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చేపట్టిన వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కూకట్‌పల్లి సర్కిల్ డీసీ గంగాధర్‌లతో కలిసి గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. దోమల నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్‌లు, యాంటి లార్వా స్ప్రేయింగ్ ఆపరేషన్లు, సీజనల్ డిసీజ్ నివారణ అంశాలు క్షేత్రస్థాయిలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య పనులు, దోమల వృద్ధిని అరికట్టేందుకు డ్రై డే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి ఉషా ముళ్లపూడి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సహకరించి చెత్తను వీధుల్లో, కాలువల్లో వేయకుండా తడి, పొడి చెత్త వేరు చేయాలని సూచించారు. చెత్త సేకరించే ఆటో వారికి మాత్రమే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఎంఓహెచ్ శ్రీనివాస్, ఏసీపీ జిషాన్, యూబీడీ మేనేజర్ మనోహర్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డా. దీపాంకర్‌పాల్, పీఓ రాజశేఖర్, సీఓ ముస్తఫా, ఎస్ఆర్‌పీ నాగేశ్వర నాయక్, డీఈ రమేష్, ఇంజనీరింగ్ ఏఈ శ్రావణి, ఎంటమాలజీ ఏఈ తేజశ్రీ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీపీఎస్ మధు, ఎస్ఎఫ్ఏ విశ్వనాథ్, జీహెచ్‌ఎంసీ విభాగాల సిబ్బంది, నాయకులు జిల్లా గణేష్, కృష్ణారావు, కట్టా శ్రీనివాస్, బి. వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మూసాపేట: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూసాపేట డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ తండ్రి దశదిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్ సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్ కుమార్, బాబూరావు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆరా..!

ఆకస్మిక తనిఖీలతో జిల్లా అధికారుల్లో హడల్

ఆరా పదానికి చాలా అర్థాలే ఉన్నాయి. తెలుగులో ఆరా అంటే కూపీ లాగడం... ఇంగ్లీషులో ఆరా అంటే ఆయన చుట్టు ప్రత్యేకమైన వాతావరణం ఉండటం.. హిందీలో ఆరా అంటే వస్తున్నాడని అర్థం. ఇవ్వన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వర్తిస్తాయనే చెప్పాలి. క్షేత్రస్థాయి పర్యటనలు.. ఆకస్మిక తనిఖీలు.. సమస్యల గుర్తింపు.. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు... వసతుల కల్పనకు నిధుల మంజూరు వంటి పక్కా ప్రణాళికతో బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే తన మార్క్ పనితీరును చూపిస్తున్నారు. ఇప్పుడిది అధికార, ఉద్యోగుల్లో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సాక్షి,మేడ్చల్‌జిల్లా: ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ మనుచౌదరి ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తున్నారు. తనఖీలకు ఆ ప్రాంతానికి వెళ్లిన తర్వాతనే సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సమాచారం అందుతోంది. దీంతో వారంతా అప్రమత్తంగా ఉంటూ ఉద్యోగులు, సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన ప్రణాళికతో నిధులు మంజూరు చేస్తూ పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

సమస్యలు తెలుసుకున్న వెంటనే నిధులు మంజూరు చేస్తూ..

ఇప్పటి వరకు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, పాలిటెక్నిక్ భవనం కోసం రూ.2 కోట్లు, కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులను ఆయన మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారునలు ఆదేశించారు. భవనాలకు అవసరమైన చోట ప్రభుత్వ స్థలాల కేటాయింపులో కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ, పీహెచ్‌సీలకు నేరుగా వెళ్లి...

ఘట్‌కేసర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కీసర పీహెచ్‌సీ, కూకట్‌పల్లి, తూముకుంట, షాపూర్, మూసాపేట యూపీహెచ్‌సీలు, మల్కాజిగిరి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా.. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ఓపీ ఎలా నడుస్తోంది.? గర్భిణుల సంఖ్య ఎంత ఉంటుంది..? వారందరూ పరీక్షల కోసం వస్తున్నారా..? రానట్లయితే వైద్య పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు.? వారిని పీహెచ్‌సీలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారా..? అని ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో విస్తృత తనిఖీలు

జగ్గంగూడ, శామీర్‌పేట, కీసర, ఉప్పల్, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో కలెక్టర్ తనఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా..? గదులు, బాత్‌రూమ్‌లు సరిగా ఉన్నాయా? లేవా అని తెలుసుకుని సమస్యలుంటే అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారు. మల్కాజిగిరి డిగ్రీ కళాశాలతో సహా పలు ఇంటర్ కళాశాలల్లో కలెక్టర్ పర్యటించి పలు పరిష్కారాలు చూపించారు. సొంత భవనాలు ఉన్న 400 అంగన్వాడీ కేంద్రాలకు పెయింట్స్ (రంగులు) బొమ్మల పెయింటింగ్స్ వేయించారు. కేంద్రాల ఆవరణలో కూరగాయలు, పూల మొక్కలు పెంచాలని ఆదేశాలిచ్చారు.

కలెక్టర్ పర్యటనలతో అధికారుల అప్రమత్తం

కలెక్టర్ ఆకస్మిక తనఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలతో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తమ శాఖ పరిధిలోని ఉద్యోగులు,సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచిస్తున్నారు. విధి నిర్వహణలో చురుకుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందుతున్న వాటిన్నంటిని సక్రమంగా వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అవినీతి ఉద్యోగుల్లో మొదలైన వణుకు..

కలెక్టర్ మనుచౌదరి అవినీతి, అక్రమాలను సహించరనే సంకేతాలు అన్ని శాఖలకు తెలియడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిలో వణుకు మొదలయ్యింది. దీంతో పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు జరగకుండా సంబంధిత ఉద్యోగులు జాగ్రత్త పడుతున్నారు. అక్రమ భవనాలు, లేఅవుట్ల ఉంటే వారికి నోటీసులు ఇస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో జిల్లా అధికారులందరూ హాజరయ్యేలా చేపట్టిన చర్యలు విజయవంతం దిశగా కొనసాగుతున్నాయి. మహిళా గ్రూపుల పనితీరుతో సహా వ్యవసాయ, ఉద్యావన పంటల పరిస్థితి, పురపాలక సంఘాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, డంపింగ్ యార్డుల నిర్వహణపై ఆరా తీస్తుండటంతో కమిషనర్లు జాగ్రత్త పడుతున్నారు.

ఫీవర్ సర్వే తీరుపై ఆగ్రహం...

సీజనల్ వ్యాధులను ఆరికట్టటానికి ఫీవర్ సర్వే నత్తనడకన సాగడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చొరవ తీసుకుని 40శాతం జరిగిన ఫీవర్ సర్వేలో వేగాన్ని పెంచారు. వ్యాధుల నివారణకు వైద్య శిబిరాల నిర్వహణ తదితర విషయాలతో సహా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులు దోపిడీ, నకిలీ డాక్టర్ల బెడదపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతో సహా ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీ అమలుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

